


# విధాత

2009లో ఓసారి హ్యూస్టన్ నించి హైదరాబాద్‌కి తిరిగి వస్తూ విమానంలో ఓ సినిమా చూసాను. పేరు గుర్తులేదు కానీ అది ఇరానియన్ సినిమా 'ఇట్స్ వండ్రఫుల్ లైఫ్' అనే హాలీవుడ్ సినిమా ప్రేరణతో ఆ ఇరానియన్ సినిమా కథని అల్లారని అనిపించింది. హాలీవుడ్ సినిమా థీమ్ ఆత్మహత్య చేసుకునే ఒకతన్ని అతని గార్డియన్ ఏంజెల్ రక్షించి జీవితం ఎంతటి అందమైందో తెలియచేసి కళ్ళు తెరిపిస్తాడు.




ఈ సినిమాలో పారిశ్రామిక వేత్త అయిన ఓ ముసలావిడ పై అంతస్థు మీంచి ఆత్మహత్య చేసుకోడానికి దూకి చచ్చిపోయే దృశ్యం ఉంది. అది మాత్రమే నాకా కథలో గుర్తున్న సన్నివేశం. ఆవిడని ఓ దేవత నిలువరించి ధైర్యం చెప్తాడు.

ఆ దృశ్యం గురించి ఆలోచిస్తే, మన హిందూ మతంలో కూడా దత్తాత్రేయుడు సదా తిరుగుతూ తన భక్తుల్ని వివిధ రూపాల్లో రక్షిస్తాడు అని దత్తచరిత్రలో చదివింది గుర్తొచ్చింది. సాధారణంగా దేవుడు మనిషికి మరో మనిషి ద్వారా సహాయం చేస్తూంటాడు. కానీ సరాసరి ప్రత్యక్షమై సహాయం చేయడు అన్నది మనందరి నమ్మకం. అనుభవం కూడా.

దత్తాత్రేయుడు స్వయంగా సహాయం చేయాల్సి వస్తే 'ఎలాంటివారికి సహాయం చేస్తాడు?' అనే ఆలోచన కలిగింది. అది విధాత నవలకి ప్రేరణ ఇచ్చిన ఆలోచన. దాన్ని బీజంగా చేసుకుని అల్లిన కథే 'విధాత'. హిందూ మతస్థులకి దైవభక్తి ఎక్కువ. అష్టాదశ పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, కుంభమేళాలు, గంగోత్రి, యమునోత్రులకి లక్షలు ఖర్చు చేసి తీర్థయాత్రలు చేస్తారు కానీ బీదవాడైన తమ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ వాచ్‌మేన్ కొడుక్కి చదువు చెప్పించడానికో, పనిమనిషికి ఐదువందలు జీతం పెంచడానికో ఇష్టపడరు. చూస్తూ చూస్తూ బీదలకి పైసాని విదిలించరు.

తనకి ఉపయోగపడని వ్యక్తికి ఇవ్వడం వృథా అన్నది ఇండియన్ మెంటాలిటీ. జూన్ 2009లో కర్ణాటక మంత్రి గాలి జనార్ధన్ రెడ్డి నలభై ఐదుకోట్ల విలువైన వజ్రాల కిరీటాన్ని తిరుమల వెంకటేశ్వరుడికి సమర్పించారు అని మీకు గుర్తుందా?

ధనవంతుడైన ఇండియన్ దేవుడికి బంగారు కిరీటాల్లాంటివి చేయిస్తాడు. బదులుగా తను కోరింది భగవంతుడు తనకి ఇస్తాడనే విశ్వాసం. దానికి తనకి అర్హత లేకపోయినా సరే, దేవుడు ఇచ్చి తీరుతాడనే నమ్మకం. ఆ బహుమతులు బీదల ఆకలిని తీర్చవు. ఇండియాలో హిందూ ఆలయాల్లో ఇలా కోటానుకోట్ల విలువైన ఆభరణాలు, డబ్బు, విలువైన వస్తువులు లాకర్లలో మూలుగుతున్నాయి.

యూరోపియన్స్ ఇండియాకి వచ్చినప్పుడు పాఠశాలలని నిర్మించారు.

ఇండియన్స్ విదేశాలకి వెళ్ళినప్పుడు ఆలయాలని నిర్మిస్తున్నారు. దీన్ని బట్టి హిందువులు దైవభక్తులు అని ఇట్టే తెలుసుకోవచ్చు.

క్రిస్టియన్స్‌లో ఆదివారం ఓ అరగంట చర్చ్‌కి వెళ్ళడం మినహా పెద్దగా దైవభక్తి ఉండదు. కానీ సేవ, దానాలు చేయడానికి ముందుకు వస్తారు. వారి మిషనరీలు కూడా వివిధ దేశాల్లో తమ మతప్రచారానికే కాక, బీదలకి సేవ చేయడానికి వెళ్తారు. మదర్ థెరీసాలాంటి వారిని హిందూ మతం గత శతాబ్దంలో సృష్టించలేదు. క్రిస్టియన్స్‌ది సేవా మార్గం. ముస్లిం మతస్థులు కూడా రంజాన్ సమయంలో బీదలకి విరివిగా దానం చేస్తారు. మనకి కూడా పుష్కరాల్లో కొన్ని దానాలు చేయాలని ఉన్నా వాటి మొత్తం విలువ వెయ్యి రూపాయలు కూడా ఉండదనే చెప్పాలి. భక్తిమార్గంలో అప్పటికే 'జయం, పరంజ్యోతి' అనే రెండు నవలలు రాసాను కాబట్టి ఈసారి విధాత నవలని సేవామార్గం ప్రధానాంశంగా రాయాలని అనుకున్నాను.

ఆరాధన మాసపత్రికలో 'జయం, పరంజ్యోతి' నవలలని సీరియల్స్‌గా రాసాను. తర్వాత ఎండోమెంట్స్ శాఖకి కమిషనర్‌గా వచ్చిన శ్రీ జె.ఎస్.వి.ప్రసాద్ అనే ఐఏయస్ ఆఫీసర్ 2010లో మరో ఆధ్యాత్మిక సీరియల్ కావాలని కోరితే విధాత నవలని ఆ పత్రికలో రాసాను.

క్లుప్తంగా కథ. ధనాహంకారంతో జీవించే 'త్రిలోచని' అనే పారిశ్రామికవేత్తకి పేదలంటే చిన్నచూపు. అరవై ఏళ్ళవాడు సైకిల్ మీద వెళ్తూంటే, వాడు తన జీవితాన్ని సంపాదించకుండా వృథా చేసుకున్నాడు అనే మనస్థత్వం. ఆఫీస్‌లోని తనకింద ఉద్యోగస్తులని అహంకారంతో పురుగుల్లా చూస్తుంది. (నాకు తారసపడ్డ ఓ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ స్వభావంతో ఈ పాత్రని సృష్టించాను) అకస్మాత్తుగా ఆవిడ ఇన్‌కంటేక్స్ వ్యవహారంలో చిక్కుకుని దాదాపు దివాలా తీసే స్థితిని ఎదుర్కొంటుంది. మర్నాడు టేక్స్ అధికారులు తన ఆస్థిని వేలం వేస్తూంటే అంతా తనని చూసి నవ్వడం భరించలేననే అహంకారంతో ముందు రోజు రాత్రి తన ఇంటి పై అంతస్థుమీంచి దూకి ఆత్మహత్యకి ప్రయత్నించినప్పుడు ఓ వ్యక్తి ప్రత్యక్షమై ఆవిడని వారిస్తాడు.

బెంగుళూర్‌లో 'నీకు నువ్వే విధాతవి' అనే బోర్డ్‌తో కనపడ్డ బిచ్చగాడుగా ఆయన్ని ఆవిడ గుర్తిస్తుంది. తనని హిందువులు దత్తాత్రేయుడుగా, యూదులు సెయింట్ ఎలీజాగా, క్రిస్టియన్స్ గార్డియన్ ఏంజెల్‌గా, ముస్లింలు ఇమామ్‌గా, జైనులు తీర్థంకర్‌గా పిలుస్తారని ఆయన చెప్తాడు. వారి మధ్య దాదాపు 25 పేజీలు సాగే ఆధ్యాత్మిక చర్చలో కర్మ సిద్ధాంతం ప్రధానాంశం. ఆ తర్వాత ఆవిడలో మార్పు వచ్చి ఇతరులకి సహాయం చేస్తూ అహాన్ని అణచేసుకుంటూ 'ఇచ్చుటలో ఉన్న హాయి'ని తొలిసారిగా అనుభవిస్తుంది.

ఆవిడ జీవితంలోని చిక్కుముళ్ళన్నీ క్రమంగా విడిపోయి ప్రశాంతమైన జీవితం ఏర్పడుతుంది. ఇందులో ఓ మంచి పాత్రకి 'పెంట రాజు' అనే పేరు కావాలని పెట్టాను. తూర్పు గోదావరి జిల్లాకి చెందిన నా శ్రేయోభిలాషి, పాఠకుడైన కె.వివేకానంద రెడ్డిగారికి ఇది నచ్చలేదు. ఆ పాత్రకి అలాంటి పేరు పెట్టకూడదని నాకు ఈమెయిల్ రాసారు వ్యక్తిగతంగా కలిసినప్పుడు కూడా చెప్పారు. నేనా పేరు పెట్టడానికి రెండు కారణాలు. ఒకటి, అన్ని పేర్లూ పెట్టాలనేది. అంతదాకా పెంటరాజు పేరు వాడకపోవడం. రెండోది, ఓ మనిషి తన పేరుని బట్టి మంచివాడు లేదా చెడ్డవాడుగా ప్రవర్తించడం ప్రపంచంలో చూడం. రామారావు రామ్మూర్తి లేదా రామచంద్ర పేరు గల వాళ్ళు తిరుగుబోతులు కావచ్చు. నాగభూషణం, భుజంగరావ్ లాంటి పేర్లని సినిమాల్లో విలన్లకి పెట్టినా వారిలో మంచివాళ్ళు ఉండచ్చు. నిజ జీవితంలో నాకు గొప్ప సహాయం చేసిన, చాలా మంచివాడైన నాగభూషణరావు అనే పాఠక మిత్రుడు ఉన్నాడు.

ఈ నవల్లో దేవుడు మానుష రూపేణా కాక స్వయంగా కొన్ని కొన్ని అద్భుతాలు చేస్తూంటాడు. ఈ నవల ఆరాధనలో సీరియల్‌గా వస్తున్నప్పుడు ఓ క్రిస్టియన్ పాత్రకి సెయింట్ ఎలిజా సహాయం చేయడం గురించి రాస్తే 'ఆరాధన' హైందవ పత్రికని, అందులో క్రిస్టియన్ మతం గురించి రాయడం క్షమించరాని నేరమని కొందరు పాఠకులు దాన్ని ప్రచురించే దేవాదాయశాఖ అధికారికి ఫిర్యాదు చేసారు.

ప్రపంచంలోని తొలి మతం హిందూమతం. దాని ప్రకారం ఉన్నది ఒక్కడే దేవుడు. ఆ దేవుడ్నే తర్వాత వచ్చిన ఇతర మతస్థుల ప్రవక్తలు కొత్త పేర్లు పెట్టి పిలుస్తున్నారు అన్నది సత్యం. దీన్ని విస్మరించిన సంకుచిత మనస్కులే క్షమించరాని వాళ్ళని నా నమ్మకమని

జవాబు చెప్పాను. హైందవేతర మతం విషయంలో సహనం లేని వారంటే నాకు చాలా అయిష్టం. కారణం ఏ పేరుతో పిలిచినా ఉన్నది ఒక్క దేవుడే అన్నది నా పరిపూరణ్ విశ్వాసం.

విధాత నవలని చదివిన కౌముది.నెట్ నిర్వాహకులు కిరణ్‌ప్రభగారు తను నాస్తికులైనా, ఈ నవల్లోని మానవత్వంతో కూడిన పాత్రలు బాగా నచ్చి దీన్ని టోరీలో శ్రోతలకి పరిచయం చేసారు. (వినడానికి ఇక్కడ క్లిక్ చేయండి)

జులై 2012లో ఆరాధన మాసపత్రికలో సీరియల్‌గా పూర్తైన వెంటనే లిపి పబ్లికేషన్స్ దీన్ని పుస్తకంగా ప్రచురించింది. 272 పేజీలు. వెల రూ.120/- ప్రస్తుతం స్టాక్‌లో పుస్తకాలు లేవు. ఈ సంవత్సరమే మలి ముద్రణ వస్తుంది.

'జయం' తర్వాత రాసిన 'పరంజ్యోతి' నాకు బాగా నచ్చిన నవల. కానీ దానికన్నా 'విధాత' పాఠకులకి బాగా నచ్చిన నవల. ఆ నవలతో ఒకరిద్దరు ఎంతగా కనెక్ట్ అయ్యారంటే తలో వంద 'విధాత' కాపీలని కొని బంధుమిత్రులకి పంచారు. చాలామంది రెండు, మూడు కాపీలని కొని వాటిని తమ ఆధ్యాత్మిక మిత్రులకి బహూకరించారు.

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments